# 32. బాగ్దేహి

రౌర్కెలాకి ఝార్సుగుడాకి మధ్యనొక చిన్న స్టేషనుంది.

ఆస్టేషనులో ఒక గూడ్సుబండి పడిపోతే మేము రాత్రికి రాత్రి వచ్చి, వేగన్లను ఎత్తడం ప్రారంభించాము. ఆపని మరునాడు సాయంకాలం అయిదు గంటల వరకు జరిగింది. రైళ్ల రాకపోకలు తిరిగి మొదలయాయి. పనివాళ్లు దగ్గిరలోనున్నగ్రామానికి టీ తాగడానికి పోయారు.

నేనొక్కడినే ప్లాట్‌ఫారమ్ మీదనున్న సిమెంటు ఛెయిర్ మీద కూర్చున్నాను. చిన్న స్టేషను- ప్లాట్‌ఫారమ్ మీద ఎవరూ లేరు - కొద్ది దూరంలో నున్న గ్రామం క్రమంగా చీకటి ఒడిలో దాగుంటున్నది.

ఏకాంతంగా కూర్చొని సాయంసంధ్యలో ఆకాశం మీద మారుతున్న రంగులు చూస్తున్న నాకు ఒక పిట్టకూతవినిపించింది. అది చాల దీనంగా ఉంది.



ఇంతలో స్టేషను నుండి చిన్నమాస్టరు అటువేపే వచ్చారు.

"రావుగారు! మీ రిలీఫ్ ట్రెయిను రాత్రి తొమ్మిది తరువాతే వెళ్తుంది. ఇక్కడ మీకు తోచక పోతే మాగదిలో కూచోవచ్చు."

ఆ పిట్ట మళ్లా కూత పెట్టింది. ఏవో రెండు మాటలు.

"రావుగారు! ఆపిట్ట ఏంకూస్తున్నదో మీకు బోధపడిందా?"

"బాధతో ఎవరో మూలుగుతున్నట్లుంది."

"దానికో కథ ఉంది. వింటారా!"

"తప్పకుండా!"

చిన్న మాస్టరు చెప్పడం మొదలు పెట్టారు.

ఈ గ్రామానికి అప్పుడు మరో పేరుండేది. ఆ అప్పుడు అన్నది డెబ్బై సంవత్సరాల కిందటిది.

గ్రామంలో ఉమాపతి మిశ్ర అన్న మహాపండితు డొకడుండేవాడు. ఆయన సంస్కృత సాహిత్యంమీద అనర్గళంగా ఉపన్యసించగల మహావక్త. అతనికి అరవైఆరు సంవత్సరాలు. మనిషి మంచి వర్చస్వి. పండుతములపాకువంటి శరీరవర్ణం. అతనికి మొదటి భార్య వలన ఒకకొడుకు కలిగాడు. ఆమె పదిహేనేళ్లు కాపురం చేసి చనిపోయింది. రెండవ భార్యమరో పాతిక సంవత్సరాలు కాపురం చేసినా బిడ్డలను కనలేదు. రెండో భార్య చనిపోయిన మూడు నెలల్లోనే అతను మూడో భార్య మంజరిని పెళ్లాడాడు. అప్పటికి ఆమె వయసు పన్నెండేళ్లే.

కథ మధ్యలో చిన్న మాస్టరు గారిని ఆపాను.

"పిల్లనెవరిచ్చారు, అంత వయసుమీరిన వాడికి?"

"ఎవరయినా యి స్తారు- ఆకాలంలో ఈ పట్టింపులులేవు. అన్నిటికన్న అతను చాల సంపదగలవాడు. పెళ్లి నాటికి చాల దృఢంగా ఉండేవాడు. మంజరికూడా మరో సంపన్నుల గృహంనుండే వచ్చింది."

తరువాత ఆయన కథ చెప్పడం సాగించారు:

గ్రామంలో చివరని ఉమాపతి గారి యిల్లు ఉంది. ఎకరంజాగాలో పూలచెట్లమధ్య, పళ్ల చెట్ల మధ్య న్నున్న పెద్ద పూరిల్లు వారిది. చాల మంది శిష్యులు ఆయింటను చదువునేర్చుకున్నారు. మూడవ భార్య వచ్చిన తరువాత, లోకాపవాదానికి వెరచి, అతను మరేశిష్యులకు ఆశ్రయమివ్వలేదు.

ఉమాపతి మిశ్రగారి కొడుకు వాచస్పతి - అతనికి ముప్పైసంవత్సరాలు. అతడు నిజానికి పండితపుత్రుడు. చదువు సంధ్యలు అతనికి అంటలేదు. తమకున్న పాతిక ఎకరాల భూములను, రెండుమామిడి తోటలను అతను స్వయంగా చూసుకుంటున్నాడు. అతనికి వివాహమయింది. అతని భార్య కూడా పెద్దింటినుండే వచ్చింది. ఆమె వయసు పాతిక సంవత్సరాలు లోపే - అందమయిన మంజరితో ఆమెను సరిపోల్చడం సరికాదేమో! మంజరి చైత్రపూర్ణిమ వంటిది- ప్రియంవద కార్తీకపూర్ణిమ-

ప్రియంవద ఉన్నతమైన కుటుంబంనుంచి వచ్చింది. తన వినయవిధేయతలతో సద్గుణాలతోను అత్తమామల ఆదరాన్ని, భర్త అనురాగాన్ని చూరగొంది. మంజరి తనకన్న చిన్నదైనా అత్తగారి కివ్వవలసిన గౌరవమిచ్చి బాగా చూసుకొనేది.

ఒక రోజు ఉదయం మామూలుగా వాచస్పతి పొలాలమీదకి వెళ్లిపోయాడు. ఉమాపతి మిశ్ర పక్క ఊరికి పోయి సాయంకాలానికి తిరిగి వస్తానన్నాడు. ఆ వూరిస్త్రీలు చెరువుకు పోయి తాగే మంచినీళ్లు తెచ్చుకుంటారు. మామగారు ఆహితాగ్ని.మడి, ఆచారం ఆయింట తరాలనుండి పీఠం వేసుకున్నవి. అత్త గారు తనకన్న చిన్నది. కాబట్టి, ప్రియంవద తానే చెరువుకుపోయి, స్నానంచేసి నీళ్లుతెచ్చేది.

ఆ రోజు ఆమె కొన్ని బట్టలుకూడా ఉతకడానికి చెరువుకు తీసుకుపోయింది. ఉదయం

తొమ్మిది కావచ్చింది. ఒక యువకుడు ఉమాపతిగారి యింటి ఆవరణకు వేసిన తడక తలుపును తీసుకొని లోపలికి ప్రవేశించాడు- ఆవరణలో నున్న పువ్వుల అందాలను చూసుకుంటూ యింటివేపు నడిచాడు. వాకిటిలో నిలబడి కొంచెం బిగ్గరగా అన్నాడు:

"ఆచార్య ఉమాపతి మిశ్ర! అభివాదనలు- నేను పూరీ నుండి వచ్చిన శ్రీకంఠుడిని. పూజ్యపాదులను చైత్రశుద్ధ పంచమి నాడు సన్మానించడానికి అటు మహారాజుగారు, ఇటు పండిత బృందం సంకల్పించి...."

అంతవరకే అతను చెప్ప గలిగాడు - అతని ఎదుటనో షోడశవర్ష ప్రాయంలో నున్న సుందరి సాక్షాత్కరించింది. శ్రీకంఠుడిని చూస్తూ చేష్టలు దక్కి నిలిచిపోయింది. విశాలమైన ఆమె కన్నులలో వింతకాంతులు - బింబాధరంపై మల్లెలవంటిచిరునవ్వులు - ఆచూపులలో బలమైన కోరిక - ఆ పృథువక్షంలో కంపన - ఆరంభోరువులలో సంచలనం - ఆమె చరణలాక్షలో తన్మయత - ఆమె శరీరం వశంతప్పింది. అడుగులు వెనక్కు వేసింది ఆమె.

వెనక్కు అడుగులు వేసి పడక గదిలోకి పోయింది. శ్రీకంఠుడు ఆమెను వెంబడించాడు. అతని చూపులు కామంతో నిండిపోయాయి- హఠాత్తుగా ఆమెను చేరి కౌగిలించుకున్నాడు - అంతకు రెండు రెట్లు బలంతో మంజరి కౌగిలించుకొంది. క్రిందటి జన్మలో ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకొని, కోరిక తీరకుండా విడిపోయి, ఈ జన్మలో కలుసుకున్నట్లు వాళ్ల ఏకమయారు. అనంగ మహాయజ్ఞంలో ఆ పడుచువాళ్లు సమిధలయారు-

ప్రియంవద ఆలస్యంగా యిల్లు చేరింది- బిందెతో తెచ్చిన నీళ్లు తినె మీద ఉంచింది - భుజం మీదనున్న బట్టలను వాకిట్లో దండెంమీద ఎండవేసింది - నుదుట కుంకుమదిద్దుకొంది. తడిచీర మార్చుకోబోయి తన పడకగది వేపు చూసింది. ఆగది తలుపులు ఎడంగా ఉన్నాయి. పందిరి మంచం మీద ప్రపంచాన్ని మరచి ఆనంద జలధిలో మునిగిన పడుచువాళ్లను చూసింది.

ఆమె కీడు శంకించింది.

అత్తకు పదహారేళ్లు - ఆమె వయసుకు నాలుగు రెట్లు పైగా నున్న వారు మామగారు. ముదుసలి - స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ చాల సహజమైనది. అత్త చేసిన తప్పు శారీరక దృష్ట్యా క్షమించదగినది.

అయ్యో! ఈ ధర్మం ఎంత కఠోరమైనది! దీని దృష్టిలో అత్త చేసిన పని క్షమించరాని మహానేరం.

మంజరి మత్తు నుండి పూర్తిగా తేరుకోలేదు- శ్రీ కంఠుడు వెళ్లిన తరువాత అడుగులు మెల్లిగా వేసుకుంటూ పడక గదినుండి బయటికి వచ్చింది. కత్తి వాటుకి కూడా ముఖంలో నెత్తురు లేని కోడలి ఎదుట ఒకక్షణం నిలబడి తనగదిలోకి వెళ్లిపోయింది.

మట్ట మధ్యాహ్నం - వాచస్పతి పొలాలనుండి ఊరివేపు నడుస్తున్నాడు - పనిచేసి

అలసిపోయాడు - అతనికి దారిలో ఒక పడుచువాడు ఎదురయాడు. అతని చేతిలో ఒక దంతపు పెట్టి ఉంది- దాని మూతమీద కోణార్కదేవాలయంలో రథచక్రం, శృంగార చిత్రాలు ఉన్నాయి. ఈ అసాధారణ మైన శిల్పం కోణార్కలో నున్న ఒకే శిల్పికి సాధ్యమవుతుంది. అతడు వాచస్పతి స్నేహితుడు. అతను బహూకరించిన ఈ పెట్టి వంటిది మరొకటి లేదు.

తనవస్తువును మరొకరి చేతిలో చూసి వాచస్పతి సహించలేక పోయాడు.

"ఆగు! ఈ పెట్టి నీకెక్కడిది?" సూటిగా ప్రశ్నించాడు.

"నా ప్రియురాలు బహుమతిగా యిచ్చింది."

"ఎవరాప్రియురులు? ఎందుకిచ్చింది?"

"అనంగరంగంలో ఆమెను గెలిచానయ్యా! తన శరీరాన్ని, హృదయాన్ని స మర్పించిన సుందరి, ఈ దంతపు పెట్టి ఇవ్వడంలో ఆశ్చర్యమేముంది?"

చండప్రచండుడయి వాచస్పతి యిల్లు చేరుకున్నాడు.

వాకిట్లో నిలబడి గట్టిగా అరిచాడు:

"రండా! సైకిరా! నా దంతపు పెట్టె ఎవరికి బహూకరించావు? చెప్పు!"

ప్రియంవద బయటికి వచ్చింది. నడి వాకిట్లో వాచస్పతి ఆమె జుట్టు పట్టుకున్నాడు. గట్టిగా అరుస్తున్నాడు!

"ఓ పుంశ్చలి! నిజం చెప్పు! లేక పోతే ఈ కొడవలితో నీ నాలుక కోస్తాను."

పూర్వాపరాలు తెలిసిన అగ్రహీణి మరొక స్త్రీ గౌరవం కాపాడడం కోసం మారుపల్కలేదు. వాచస్పతి అగ్రహాఉగ్రుడయాడు. ఆ పశువు కొడవలితో ఆమె నాలిక కోసివేశాడు - సాయంకాలానికి ఆమె శరీరం పంచభూతాలలో కలిసిపోయింది - ఉమాపతికుటుంబం నాశనమయింది.

ఆ రాత్రి ఊరివాళ్ల కో పిట్టకూత వినిపించింది.

దుఃఖంతో నిండిన ఆ కూతలో రెండు విడి మాటలు వినిపించాయి.

ఇంత వరకు చిన్న మాస్టరు చెప్పారు. కంట్రోలులో ఎవరోపిలుస్తుంటే వెళ్లిపోయారు

మళ్లా ఆకూతవినవచ్చింది-

ఒక అమాయకురాలు నిజం చెప్పడానికి వాక్కును కోరుకుంటున్నది.

రైలొకటి దూసుకుంటూ పోయింది. దాని దీపకాంతులు బోర్డుమీద పడి స్టేషను పేరుకనిపించింది-

వాక్‌దేహి - వాగ్దేహి - అదే బాగ్దేహి!

(ఆహ్వానం - మాసపత్రిక) ♣